క్లుప్తంగా

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జైలర్



జగిత్యాలజోన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతిని గురువారం జగిత్యాల స్పెషల్ సబ్ జైలు జైలర్ మొగిలేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు భూభారతి చట్టంపై అవగాహన

మల్లాపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ హాజరు కానున్నారని, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోసానిపేటలో బడిబాట

కథలాపూర్: పోసానిపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లి అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, అందిస్తున్న విద్యను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు రాజేంద్రప్రసాద్, నల్ల రాజయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి



బండలింగాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్, రాజేశ్వర్‌రావుపేట గ్రామాల్లో గురువారం జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కృషి చేస్తోందని పలువురు నేతలు పేర్కొన్నారు. బ్లాక్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గండి హనుమాన్ ఆలయ చైర్మన్ రామానుజన్‌రెడ్డి, నాయకులు తిరుపతి, రాజేందర్, రాహుల్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: రాజ్యాంగ పరిరక్షణతోనే అందరికీ సమన్యాయం దక్కుతుందని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లింగం, కొమిరెడ్డి లింగారెడ్డి తదితరులున్నారు.

నిర్మల్ జిల్లా పీసీసీ పరిశీలకుడిగా ఆవేజ్



మెట్‌పల్లి: పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ ఆవేజ్‌ను నిర్మల్ జిల్లా పీసీసీ పరిశీలకుడిగా నియమించారు. ఇటీవల ఆయనను జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమానికి సంబంధించి సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు. గతంలో పార్టీ సోషల్ మీడియా విభాగంలో పని చేశారు.

అగ్ని ప్రమాదంలో ఈత చెట్లు దగ్ధం



కథలాపూర్: సిరికొండ గ్రామ శివారులో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో 1,500 ఈత చెట్లు కాలిపోయినట్లు గీత కార్మికులు తెలిపారు. పిచ్చిమొక్కలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా.. అవి చెలరేగి ఈత చెట్లకు వ్యాపించినట్లు పేర్కొన్నారు.

గ్రామాలకు చేరని 'పల్లె వెలుగు'

- ఏళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు



ఆర్టీసీ బస్సు

బుగ్గారం: మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రోడ్డు రవాణా సౌకర్యాలు ఎంతో బాగుండాలి. దీంతో గ్రామాల మధ్య అనుసంధానం పెరిగి ప్రజల రాకపోకలు మెరుగుపడతాయి. నిత్యం వివిధ అవసరాల కోసం ప్రయాణం చేసేవారికి సౌకర్యంగా ఉంటుంది. యశ్వంతరావుపేట, గంగాపూర్ గ్రామాలకు ఏళ్లు గడుస్తున్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం కలగానే మిగిలింది. దీంతో ఈ గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. చాలా సందర్భాల్లో అవి అందుబాటులో లేనప్పుడు నడిచే ప్రధాన రహదారుల వరకు వెళ్లి బస్సులు వెతుక్కోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కోరినప్పుడే హడావుడి

తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరినప్పుడు కొంతకాలం బస్సులను నడిపి హడావుడి చేసే అధికారులు.. తర్వాత ప్రయాణికుల సంఖ్యను సాకుగా చూపి బస్సులను రద్దు చేస్తున్నారు. దీంతో వారికి ఆర్టీసీ ప్రయాణం మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది. ఆయా గ్రామాల నుంచి ప్రతినిత్యం జిల్లా కేంద్రం, ఇతర పట్టణాలు, గ్రామాలకు ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా, వ్యక్తిగత అవసరాలరీత్యా వెళ్లాలంటే తీవ్రంగా అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం జగిత్యాలలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. బాలికలు ప్రయివేటు వాహనాల్లో వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున్నా.. బస్సు సౌకర్యం లేదు

జాతీయ రహదారి 63 నుంచి యశ్వంతరావుపేట గ్రామం గుండా వెల్గటూర్ వరకు రెండు వరుసల రహదారి ఉన్నా.. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. దీంతో ఈ గ్రామ ప్రజలు జగిత్యాల వెళ్లాలంటే కల్లెడ వరకు, వెల్గటూర్ వెళ్లాలంటే సమీపంలోని శెకెల్ల వరకు ప్రయివేటు వాహనాల్లోనే పోవాలి. ఈ మార్గం గుండా జగిత్యాల నుంచి వెల్గటూర్ మీదుగా లక్సెట్టిపేట వరకు ఓ బస్సును నడిపితే.. యశ్వంతరావుపేట, శెకెల్ల గ్రామాల ప్రజలతోపాటు వెల్గటూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

ఉచిత ప్రయాణ ఫలితమేది

ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నా.. తాము గ్రామం దాటాలంటే ప్రయివేటు వాహనాల్లోనే వెళ్లాల్సి వస్తోందని గంగాపూర్, యశ్వంతరావుపేట మహిళలు వాపోతున్నారు. సమయానుసారం వాహనాలు అందుబాటులో ఉండకపోవడంతో ముఖ్యమైన పనుల మీద జగిత్యాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం నుంచి రాత్రిపూట స్వగ్రామాలకు వచ్చేవారికి వాహనాలు అందుబాటులో లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని ఈ గ్రామాలు ప్రజలంటున్నారు. జాతీయ రహదారి వద్ద గల తమ గ్రామాల బస్‌స్టాప్‌ల వద్దకు తమవారిని ప్రత్యేకంగా రప్పించుకోవాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి



గంగాపూర్, యశ్వంతరావుపేట గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందని ద్రాక్షగానే మారింది. ఏళ్లు గడుస్తున్నా ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్థానికుల కోరిక మేరకు ఈ రెండు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– మెడవేణి శ్రీధర్, యశ్వంతరావుపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



గంగాపూర్, యశ్వంతరావుపేట గ్రామాలకు బస్సులు నడపాలని స్థానికులు అభ్యర్థిస్తే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– కల్పన, జగిత్యాల డిపో మేనేజర్



కథలాపూర్‌లో బీజేపీ నాయకుల ర్యాలీ



కోరుట్ల: నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు



మెట్‌పల్లి: మౌనం పాటిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఉగ్ర దాడి అమానుషం

మెట్‌పల్లి: హిందువులపై ఉగ్రవాదులు దాడులు జరిపి హతమార్చడం అమానుషమని పలువురు పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అధ్యక్షుడు గంగసాగర్, వైద్యులు పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అధ్యక్షుడు కొండ మురళి, సంఘ సభ్యులున్నారు.

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు జరిపి హిందువులను హతమార్చడాన్ని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ శుక్రవారం మెట్‌పల్లి బంద్‌కు పిలుపునిచ్చింది.

కోరుట్ల: పట్టణంలో వివిధ పార్టీలు, ముస్లింలు గురువారం రాత్రి నివాళి అర్పించారు. బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద కోరుట్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నివాళి అర్పించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద, ముస్లింలు కార్గిల్ చౌక్ వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

కథలాపూర్: కథలాపూర్‌లో బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సురభి నవీన్, కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, మల్యాల మారుతి, కథలాపూర్ మహేశ్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయికల్: పాత బస్టాండ్‌లో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపతిపూర్ గ్రామంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు చెలిమెల మల్లేశం, ప్రధాన కార్యదర్శి రొట్టె శ్రీధర్, కోశాధికారి సమీర్, గౌరవ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, సభ్యులు మహేందర్‌బాబు, పారిపెల్లి మహేశ్, సుకేశ్, అస్లాం పాల్గొన్నారు. పట్టణంలోని వర్తక, వ్యాపారస్తులు, బట్టల వర్తక సంఘం నిర్వాహకులు శుక్రవారం స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ధర్మపురి: పట్టణంలో శారద బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో నందీ కూడలి నుంచి గాంధీ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి నివాళి అర్పించారు.

పెగడపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నివాళి అర్పించారు. పల్లె మోహన్‌రెడ్డి, కొత్తూరి బాబు, తోడేటి గంగయ్య, తడగొండ అంజయ్య, తడగొండ శ్రీనివాస్, పవన్, బీరన్, నరేందర్, రవీందర్‌రెడ్డి, జనార్దన్, సునీల్, సాగర్ పాల్గొన్నారు.

ధర్మపురి: ఉగ్రవాదుల చేతిలో బలైన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధ్యులైన ఏ ఒక్కరినీ కేంద్రం వదిలిపెట్టబోదని అన్నారు. కన్నం అంజన్న, కొమ్ము రాంబాబు, కస్తూరి సత్యం, ఓరుగంటి చంద్రశేఖర్, బెజ్జారపు లవన్‌కుమార్, వైకుంఠం తదితరులున్నారు.

సారంగాపూర్: ఉగ్రవాదుల దాడి హిందూ ధర్మంపై దాడని హిందూ యువజన సంఘాల మండల శాఖ అధ్యక్షుడు శోభన్, బీజేపీ రైతు విభాగం నాయకుడు పురుమల్ల నగేశ్‌రెడ్డి అన్నారు.



ధర్మపురిలో మహిళల ర్యాలీ



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న ఆర్ఎంపీ వైద్యులు



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గా అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. నాయకులు బద్దం తుక్కారెడ్డి, పిడుగు సందయ్య, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకార పారిశ్రామిక సొసైటీ ఏర్పాటు



మత్స్యకార సొసైటీ సభ్యులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహుపల్లె, బీర్‌పూర్ గ్రామాల్లో గురువారం మత్స్యకార పారిశ్రామిక సొసైటీని ఏర్పాటు చేశారు. నూతికట్ల లావణ్య, గుమ్మల సరిత, గుమ్ముల లక్ష్మి, మేడి స్వరూప, దూసమూడి గంగలక్ష్మి, గుమ్ముల లత, జల్ల భాగ్యవి, ఆర్మూరు శోభ, ఆర్మూర్ రాధ, గుమ్ముల పోచమ్మ, గుమ్ముల లింగవ్వ, జల్ల లావణ్య, జల్ల అమ్మాయి, గుమ్ముల మంజుల, గుమ్ముల భవాని, శాకపురం జమున, కొమురక్క తదితరులున్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి: జిల్లాలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి సూచించారు. పట్టణంలోని పుర వీధుల గుండా గురువారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు గజెల్లి రాందాస్, కార్తీక్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ప్లాట్‌ఫాంలు నిర్మించాలి

పెగడపల్లి: ఐకేపీ(సెర్ప్), సహకార సంఘాల ఆధ్వర్యంలో మండలంలో ప్రతి ఏటా ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్లాట్‌ఫాంలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. కేంద్రాలకు శాశ్వత స్థలాల్లేక అధికార యంత్రాంగం ప్లాట్‌ఫాంల నిర్మాణాలపై శ్రద్ధ చూపడం లేదని రైతులు చెబుతున్నారు. కేంద్రాలు ఏర్పాటు చేసిన స్థలాల్లో తెచ్చిపోసిన ధాన్యం మట్టిలో కలిసి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మండలంలో ఏళ్ల క్రితం నుంచి ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా.. వాటికి శాశ్వత స్థలాలు గుర్తించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోంది. ప్రతి ఏటా వానాకాలం, యాసంగి సీజన్లో పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలు, ఐకేపీ(సెర్ప్)ల ఆధ్వర్యంలో మండలంలోని అనేక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. కేంద్రాల ఏర్పాటుతో రైతులకు ప్రయోజనమున్నా.. వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారు. ధాన్యం మట్టిలో కలుస్తోందని రైతులు పరదాలు కిరాయికి తెచ్చుకుంటున్నారు. పరదాల అద్దె తడిసి మోపడవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించి ప్లాట్‌ఫాంలు నిర్మించాలని వేడుకుంటున్నారు.



పెగడపల్లిలో కిరాయి పరదాలపై ఆరబోసిన ధాన్యం

అధిక ధరలకు విక్రయించొద్దు



మాట్లాడుతున్న ఏవో యోగిత

కథలాపూర్: ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించొద్దని ఏవో యోగిత సూచించారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ దుకాణంలో ధర బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని అన్నారు.



పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు సమీపంలో మలుపు వద్ద గతంలో ఓ యువకుడిని లారీ ఢీకొట్టగా మృతిచెందాడు. ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్లు విస్తరించిన సమయంలో సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్న మలుపులను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ, సెల్ నంబర్: 9440818090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

గ్రామాభివృద్ధికి సహకరించాలి



బుగ్గారం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రత్యేకాధికారి సునీత

బుగ్గారం: గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడపడానికి గ్రామ ప్రజలు సహకరించాలని బుగ్గారం ప్రత్యేకాధికారి జి.సునీత అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆమె అధ్యక్షతన బుగ్గారంలో గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి అక్బర్, వీడీసీ కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, సభ్యుడు సుంకం ప్రశాంత్, నాయకులు నర్సాగౌడ్, అబ్దుల్ రహమాన్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

బుగ్గారం గ్రామంలో ఇళ్ల అనుమతుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, గత పంచాయతీ కార్యదర్శి నరేందర్ విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపిస్తూ వీడీసీ కోర్‌కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి స్పెషల్ ఆఫీసర్ సునీతకు ఫిర్యాదు చేశారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామంలో గురువారం నేషనల్ పంచాయతీరాజ్ డే సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి, ఎంఈవో సిరుప నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి రాణి, పాల్గొని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

పెగడపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా జరిపారు. కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి పరిసరాలు, పరిశుభ్రత, మంచినీటి పొదుపు, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువు తయారీ కేంద్రం పరిశీలన



ఎరువు తయారీ పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణ శివారులోని ఎరువు తయారీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ గురువారం సందర్శించారు. ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసి తయారు చేసిన ఎరువును రైతులకు కిలో రూ.10 చొప్పున విక్రయిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎనిమల్ కేర్ సెంటర్‌ను కూడా పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాయికల్ సహకార సంఘం సందర్శన



సహకార సంఘంలో అధికారులు

రాయికల్: టీఎస్ క్యాబ్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం సహకార సంఘాల సెక్రటరీలు, సిబ్బంది రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించారు. సహకార సంఘాల్లో లావాదేవీలు, బిజినెస్ సంఘం లోన్లు, డిపాజిట్లు, అప్లికేషన్స్, ఫర్టిలైజర్ నిర్వహణపై సీఈవో రవికుమార్ వివరించారు. రాయికల్ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, బ్యాంక్ మేనేజర్లు మార్కండేయ, మహేశ్, మున్వర్అలీ, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సీఈవో కట్కం జగదీశ్ పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం



మల్లాపూర్: సన్మానిస్తున్న నాయకులు

మల్యాల: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. తాటిపల్లి బాలికల గురుకులం కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ మానస పాల్గొన్నారు.

మల్లాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని జ్యోతిబాపూలే గురుకులంలో చదివి ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో స్టేట్ టాపర్‌గా(431 మార్కులు) నిలిచిన కాసారపు కృష్ణప్రియను మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కనుక మోహన్‌రెడ్డి అభినందించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కృష్ణప్రియను సన్మానించారు. కృష్ణప్రియ తండ్రి భూమారెడ్డి ఇటీవల భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా నియామకం కావడంతో సన్మానించారు. లక్కం వెంకటేశ్, ముత్యాల చంద్రశేఖర్, పుప్పాల మహేశ్, మొరపు జలపతి, కనుక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.